www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 నవంబర్ 2025

5

తిరుపతి



టిటిడికి 105 వినికిడి యంత్రాలు విరాళం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి వాస్తవ్యుడు ఎన్.విరాట్ రూ.20 లక్షలు విలువ చేసే 105 వినికిడి యంత్రాలను సోమవారం టిటిడికి బహుకరించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కు అందజేశారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పూర్తి చేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు ఈ వినికిడి యంత్రాలను అందజేస్తారు. శిక్షణ పూర్తి అయ్యాక ఈ యంత్రాల ద్వారా వినికిడి లోపం లేకుండా ఉండేందుకు ఉపయోగపడతాయి.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

కార్పొరేషన్ కార్యాలయంలో..

పరిష్కరిస్తారనే నమ్మకంతో..!

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 288 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో సోమవారం అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిటలాడింది.. స్థానికంగా తమ సమస్యను పట్టించుకోకపోవడంతో విసిగి వేసారిన బాధితులు తిరుపతి కలెక్టరేట్‌కు సోమవారం చేరుకున్నారు. ప్రతి అర్జీదారునికి సకాలంలో సమస్యలు పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఎప్పటిలానే ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సీ, డిఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, రోజ్ మాండ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. మొత్తం 288 అర్జీలు అందాయి.

వికలాంగ శాతాన్ని తగ్గించారు : మురళీగౌడ్, రాష్ట్ర అధ్యక్షులు, దివ్యాంగుల సేవాసమితి

పుట్టుకతో వికలాంగులమని ధ్రువీకరించి పించను మంజూరు చేస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు పింఛన్ల రీ వెరిఫికేషన్ పేరుతో 90 శాతంగా ఉన్న వికలాంగ శాతాన్ని సదరం సర్టిఫికెట్ లో 50 శాతం చూపడం దారుణం. వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే మూడు చక్రాల వాహనాల కోసం దరఖాస్తు గడువును పెంచాలి. పరీక్షలో విద్యార్థి బాగా రాసి మార్కులు రాకపోతే ఎంత బాధపడతారో, వికలాంగులకు ఉన్న వికలాంగ శాతాన్ని కూడా తగ్గించి చూపడం పట్ల అదే విధమైన బాధను పడుతున్నాం. కొందరి అధికారుల తీరు వలన ఇలా జరుగుతోంది. ప్రభుత్వం పట్టించుకొని న్యాయం చేయాలి.

సమస్య పరిష్కరించకనే తప్పుడు నివేదిక దమయంతి, అడవికొడియంబేడు, పిచ్చాటూరు

మా పూర్వీకులకు సంబంధించిన భూమికి పోవడానికి వీలు లేకుండా డేవిడ్ రాజ్ అనే రాజకీయ నాయకుడు అధికారులను మభ్యపెట్టి నేను ఇచ్చిన అర్జీలను పరిష్కరించినట్లుగా జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికను పంపారు. 2024లో సత్యవేడుకు వచ్చిన మంత్రి లోకేష్ ను కలిసి వినతి ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వానికి సంబంధించిన పోరంబోకు భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు కడుతూ దారి లేకుండా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేస్తే, వారు ఏర్పాటుచేసిన బోర్డును నిమిషాల వ్యవధిలో తొలగించాడు.సమస్యను పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు తప్పుడు నివేదిక పంపిన అధికారులపై తగిన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.

యోగిమల్లవరం ప్రభుత్వ భూమి ఆక్రమణ : సిపిఎం

తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం గ్రామంలోని ప్రభుత్వ చెరువు భూమి (సర్వే నంబర్ 1/1/1/2)లో ఆక్రమణలను తొలగించాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు జయచంద్ర, కె.సుమన్ కలెక్టర్‌కు విన్నవించారు. కోట్ల రూపాయల విలువ చేసే భూమి కబ్జాకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు పట్టనట్లు ఉండటం ఏంటని ప్రశ్నించారు.

'బి' బ్లాక్ మెట్ల వద్ద పెచ్చు విడిభాగాలను తొలగిస్తున్న పారిశుద్ధ సిబ్బంది

కలెక్టరేట్‌లో తప్పిన పెను ప్రమాదం

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పెను ప్రమాదం నుండి అర్జీదారులు తప్పించుకున్నారు. కలెక్టరేట్ బి బ్లాక్ లో మెట్లు పైభాగం నుండి పెచ్చులు ఊడిపడి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో సమీపంలోనే ఉన్న అర్జీదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి ఏం జరిగిందోనని ఆందోళన వ్యక్తం చేస్తూ చుట్టుపక్కల పరిశీలించారు. మెట్లు పైభాగం నుండి పెద్ద పరిమాణం కలిగిన పెచ్చు మెట్ల నిర్మాణ భాగం నుండి ఊడి పడిపోయింది. అర్జీదారులు, కలెక్టరేట్ సిబ్బంది ఎవరూ ఆ ప్రాంతంలో ఆ సమయానికి లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పెద్ద పరిమాణం కలిగిన పెచ్చు ఎవరైనా అర్జీ దారుడుపైన పడి ఉంటే తలకు బలమైన గాయమై ఉండేది. జిల్లా కలెక్టరేట్ లోని రెండు బ్లాకులలో అక్కడక్కడ నాణ్యతలేని నిర్మాణం కారణంగా వర్షపు నీరు నిలిచిపోవడం, స్లాబ్ పాడవడం వంటివి ఉన్నాయని, టీటీడీ, జిల్లా కలెక్టర్ భవనం పరిస్థితిపై సమీక్షించి అర్జీదారులకు ఎటువంటి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించండి : డి.జనార్ధన్

తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలో ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన కోటిన్నర రూపాయలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధి హామీ కూలీలతో కలిసి నిరసన చేసి కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందించారు. నాగలాపురం, పుత్తూరు, వెంకటగిరి, కెవిబిపురం మండలాల నుంచి కూలీలు పాల్గొన్నారు. దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఆగస్టు మాసం నుంచి బకాయిలు నిలిచిపోయాయని, ఉపాధి హామీ చట్టంలో 14 రోజులకు మించి బకాయిలు ఉండకూడదనే నిబంధన ఉందని గుర్తు చేశారు. వెంకటగిరి మండలం కలపాడు రెవెన్యూ పరిధిలో 1440 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పట్టాలు ఇవ్వాలని, కెవిబి పురం మండల పరిధిలోని ఎగువపూడి గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న క్వారీని తక్షణమే రద్దు చేయాలని, పుత్తూరు మున్సిపాలిటీ జ్యోతి బసు నగర్ లో ఉన్న పేదలకు ఇంటి పట్టాలు కోసం గత పది సంవత్సరాలుగా బేస్మెంట్లు వేసి ఆందోళన చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. నారాయణవనం మండలం వెత్తల తడుకులో అటవీ శాఖ సిబ్బంది దౌర్జన్యం ఆపాలని, దళితులు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని కోరారు. పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్, నాగలాపురం మండల కార్యదర్శి మురుగేష్, కెవిబిపురం మండల కార్యదర్శి శంకరయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు అముదా, దినమని, వెంకటగిరి నాయకులు చంగయ్య తదితరులు పాల్గొన్నారు

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి....

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వందలాది మంది ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, ఎం టి ఎస్ లను వెంటనే అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్ళదీస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ కు ఉన్న డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 10వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

నగర కార్పొరేషన్‌లో 31 వినతులు

తిరుపతి టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 8 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి'కి 65 వినతులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 65 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డి) కె. గురవయ్య పాల్గొన్నారు.

నెల్లూరులోకి గూడూరు..మదనపల్లికి పుంగనూరు..

నేడో రేపో ఉత్తర్వులు..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ చేసిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ సరిగ్గా లేదని రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో కూటమి ప్రభుత్వం తిరిగి జిల్లాల పునర్విభజనకు నడుం బిగించింది. ఇందుకోసం మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఐదుగురితో కమిటీ వేసింది. అనగాని నేతృత్వంలో ఏడాదిపాటు అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి అందిన ఫిర్యాదులపై ఆయా ప్రాంతాలకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. రాష్ట్రంలో మదనపల్లి, మార్కాపురం, అమరావతి జిల్లాలను అదనంగా ఏర్పాటు చేయాలని నిర్ధారణకు వచ్చారు. రాష్ట్రంలో జిల్లాల్లో కలిపిన నియోజకవర్గాలు సుదూరంగా ఉన్నాయని కమిటీకి వినతులు రావడంతో వాటిలోనూ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లాల పునర్విభజన కమిటీ మరోసారి సోమవారం తుది సమావేశం అయ్యింది. సుదీర్ఘంగా చర్చించారు. నెల్లూరు జిల్లాలోకి గూడూరు నియోజకవర్గం మండలాలైన గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, సర్వేపల్లిలు ఉండగా సర్వేపల్లి తప్ప మిగిలినవన్నీ తిరుపతి జిల్లాలో కలిసాయి. గూడూరు నియోజకవర్గం నెల్లూరుకు దగ్గరగా ఉంటుందని, అరగంటలో చేరుకోవచ్చని, తిరిగి నెల్లూరు జిల్లాలో కలపాలని వినతులు ఇచ్చారు. నారా లోకేష్ యువగళంలోనూ ఈ మేరకు హామీ ఇచ్చి ఉన్నారు. తిరిగి నెల్లూరు జిల్లాలో కలపనున్నట్లు తెలుస్తోంది. తిరుపతి జిల్లాకు సమీపంలో ఉన్న వడమాలపేట, పుత్తూరులను అప్పటి మంత్రి ఆర్‌కె రోజా తిరుపతి జిల్లాలో ఉండేలా నిర్ణయించారు. నిండ్ర, విజయపురం, నగరి మండలాలు చిత్తూరు జిల్లాలోనే ఉండిపోయాయి. నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కమిటీకి విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. భౌగోళిక రీత్యానూ తిరుపతి జిల్లాలోనే ఉండటం అని భావించారు. ఇప్పటివరకూ 31 మండలాలు ఉన్న చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకు సమీపంలోని మదనపల్లి జిల్లాలోకి బదిలీ కానున్నాయి. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాలు మదనపల్లిలో కలుస్తాయి. తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదన ఉండడంతో చంద్రగిరిలో పాత పద్ధతిలో పులిచెర్ల రానుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 34 మండలాలు ఉండేవి. గూడూరు పోక, నగరి, పులిచెర్ల రాకతో 33గా ఉండనుంది. ఒక్క మండలం తగ్గుతుంది. అదే చిత్తూరు జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిత్తూరు రూరల్ కలిపితే 31 మండలాలుగా ఉంది. 22 మండలాలు ఉంటాయి. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరును మండలంగా ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. వి.కోటను రెండు మండలాలు చేయనున్నారు. ఇదే గనక జరిగితే చిత్తూరు జిల్లాలో 24 మండలాలుగా పునర్విభజన కానుంది.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో రక్షణ కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి సాగుతున్నాయని, ఉదయం పూట ఒక్కసారిగా రైళ్లన్నీ వస్తున్న సందర్భంలో వేలాదిమంది భక్తులు బయటకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో సందర్భంలో తొక్కిసలాట జరుగుతోందని సిపిఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కాంట్రాక్టర్ వేడుక చూస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను లేఖలు రాయనున్నట్లు చెప్పారు. తిరుపతి సిపిఎం కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట నివారణకు తగిన జాగ్రత్తలను రైల్వే యాజమాన్యాలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర ప్రజా సౌకర్యాలు అన్నింటినీ ప్రైవేట్ సంస్థలకు అప్పజెబుతూ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని మండిపడ్డారు. విశాఖస్టీల్ ప్లాంట్ మూసివేతను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్ధించడం ఎవరి ప్రయోజనాలకోసం అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ కార్మికులు సోమరిపోతులని, అవినీతిపరులని అవమానించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బిజెపితో అంట కాగుతూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని ప్రజలు తిప్పికొట్టకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని పెనుమల్లి మధు అన్నారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర పాల్గొన్నారు.

పాటల రచయిత సోమశేఖర్‌కు ఘనసత్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సమాజ హితం కోరి శ్రమజీవుల పక్షాన నిలబడి పాటలు రచిస్తున్న పరిశోధకులు తుమ్మలపల్లి సోమశేఖర్ (అంధుడు)ను వేమన విజ్ఞాన కేంద్రంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు శాలువాతో ఘనంగా సత్కరించారు. సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. మధు మాట్లాడుతూ సమస్త సంపదకు మూలం శ్రమని, ఆ శ్రమ దోపిడీ వల్లనే కార్పొరేట్ల సంపద వందల రెట్లు పెరుగుతోందన్నారు. శ్రమ ప్రాధాన్యత తెలియజేస్తూ, దోపిడీని ప్రశ్నిస్తూ తన రచనల ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా మ్యూజిక్ సమకూర్చి కార్మికోద్యమాలకు అండగా నిలుస్తున్నందుకు అభినందించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, డాక్టర్ కడివేటి మునిరత్నం, డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, నడ్డినారాయణ, మునిలక్ష్మి, ఒ.వెంకటరమణ, నాగార్జున, రఫీ, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి వాగ్వాదాలు

ఏఐసీసీ పరిశీలకురాలి ముందే నినాదాలు

ఏఐసీసీ పరిశీలకురాలు సుధా రామకృష్ణన్‌తో వాగ్వాదం చేస్తున్న గోపి గౌడ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

జాతీయ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి నుండి పార్టీ బలోపేతం కోసం చేపట్టిన సంస్థాగత నిర్మాణ కార్యక్రమం తిరుపతి జిల్లాలో వాడి వేడిగా ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్ష పదవి కోసం తమిళనాడు మైలాడుతురై ఎంపీ పరిశీలకురాలుగా సుధా రామకష్ణన్ హాజరై జిల్లా అధ్యక్ష పదవి రేసులో ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవడానికి సోమవారం తిరుచానూరు పరిధిలోని ఓ ప్రైవేటు హోటల్లో కార్యక్రమం జరిగింది. తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల నాయకుల వాగ్వాదాలతో ఎంపీ సుధా రామకృష్ణ అసహనంతో విసిగిపోయారు. కార్యక్రమం ప్రారంభం కాకముందే జిల్లా అధ్యక్ష పదవి కోసం రేసులో ఉన్న వారి అనుచర వర్గం నినాదాలు పదేపదే చేయడంతో ఒకింత గందరగోళం నెలకొంది. నేరుగా ఎంపీ కలగ చేసుకొని చెప్పినా వినకపోవడం గమనార్హం. ప్రస్తుత జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, యార్లపల్లి గోపి గౌడ్, పంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్ష పదవులకు దరఖాస్తులలో ముందున్నారు. ఈ నేపథ్యంలో యార్లపల్లి గోపి గౌడ్ మద్దతుదారులు స్టేజ్ పైకి గోపి గౌడ్ ను పిలవకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక దరఖాస్తులకు సంబంధించిన సమాచారం ఇంత రహస్యంగా ఎందుకు చేస్తున్నారు? అని కొంతమంది నాయకులు ఎంపీని నిలదీశారు. ఈ సమయంలో మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ జోక్యం చేసుకున్నా వారు వినకుండా మరింతగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐసిసి పరిశీలకురాలు, ఎంపీ సుధా రామకృష్ణన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాలతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో, అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం క్యాడర్ లో పటిష్ట నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు ఉన్నాయని, ఆ కలహాలు శృతిమించి పోయాయని, అధిష్టానం దృష్టికి సదరు సమస్యను ఏ విధంగా తీసుకెళ్తారు అని మీడియా ప్రశ్నించగా, ఇదంతా తమ కుటుంబమేనని తామే పరిష్కరించుకుంటామని ఏఐసీసీ పరిశీలకురాలు చెప్పడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు మధన్మోహన్, టిక్కి రాయల్, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా పుంజుకుందాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం రావాలంటే క్షేత్రస్థాయిలో బలమైన సంస్థాగత నిర్మాణం జరగాలని ఏఐసీసీ పరిశీలకురాలు, తమిళనాడు ఎంపీ సుధా రామకృష్ణన్ అన్నారు. శ్రీకాళహస్తిలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, మదన్ మోహన్ రెడ్డి, తమటం వెంకట నరసింహులు, కలిందర్, శబరి రాజన్, తలపా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్లు అమలు కోసం జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ నవంబర్ 26 తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఎఐటియుసి, సిఐటియు సంఘాలు వెల్లడించాయి. సోమవారం యశోద నగర్ లోని సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి. ఏ రాధాకష్ణ. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్ జయ చంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రమణ్యం తెలిపారు. కార్పోరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులు సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను కాలరాయడానికి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారని విమర్శించారు.

శ్రీకాళహస్తిలో... మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తలపెట్టనున్న దేశవ్యాప్త కార్మిక సంఘాల నిరసనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్మిక సంఘాల నిరసన, ఉల్లంఘన కార్యక్రమం జయప్రదం చేపట్టాల్సిన కార్యచరణ గురించి నాయకులు చర్చించారు. జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో రౌండ్‌టేబుల్ సమావేశం

వైభవంగా అమ్మవారి రథోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. రథోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేస్తారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేస్తారు. ఈ రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వీర బ్రహ్మం, సివిఎస్వో మురళీకష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసా చార్యులు, అర్చకులు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత

తిరుచానూరు పద్మావతి దేవిని దర్శించుకునేందుకు వచ్చి తప్పిపోయిన చిన్నారిని పోలీసులు చాకచక్యంగా పసిగట్టి, గంటల వ్యవధిలోనే కుటుంబానికి అప్పగించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తమిళనాడు తిరువల్లూరు జిల్లా కొత్త గుమ్మడిపూండికి చెందిన సురేందర్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుచానూరు పద్మావతి దేవి దర్శనానికి సోమవారం విచ్చేశారు. ఆలయం వద్ద రద్దీ ఎక్కువగా ఉండడంతో కుమార్తె దాన్వీ (2) తప్పిపోయింది, చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే తిరుపతి పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు కమాండ్ కంట్రోల్ నుండి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని విశ్లేషిస్తూ ప్రత్యేక శోధన బందాలు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ టెక్నికల్ టీమ్ సమన్వయంతో కేవలం గంట వ్యవధిలోనే పుష్కరిణి పరిసరాల్లో ఆ బాలికను గుర్తించి భద్రంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. తక్షణం తమ బిడ్డను తిరిగి అందించినందుకు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు తిరుచానూరు పంచమి

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టంగా నిర్వహించబడే పంచమి తీర్థం (చక్రస్నానం) ఉత్సవం సందర్భంగా భక్తులు అశేషంగా రానున్న నేపథ్యంలో సోమవారంశిల్పారామంలో బందోబస్తు అధికారులు, సిబ్బందితో విస్తత సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ నిర్వహించారు. పక్క రాష్ట్రాలు మాత్రమే కాకుండా దేశ నలుమూలల నుండి భక్తులు పంచమి గడియలో పుణ్యస్నానం ఆచరించడానికి భక్తులు రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, రద్దీ నియంత్రణ మొదలగు అంశాలను దష్టిలో ఉంచుకొని అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఎస్పి, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ సివిఎస్ఓ మురళీకష్ణలతో కలిసి పుష్కరిణి, పసుపు మండపం, ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలు, హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్ వ్యవస్థ, వైద్య సహాయక కేంద్రాలు, కమాండ్ కంట్రోల్ అనుసంధానం వంటి కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ సూచనలు జారీ చేశారు.

విద్యార్థిని లహరికి అభినందన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తృతీయ సంవత్సరం బి.కాం చదువుతున్న విద్యార్థినికి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ తెలిపారు. శ్రీభగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా సత్యసాయి సేవ సంస్థ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో లహరికి ఈ బహుమతి లభించిందన్నారు. కోశాధికారి కొండ్రెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ భగవద్గీత 700 శ్లోకాలను కంఠస్థం పట్టిన ఈ విద్యార్థిని భగవద్గీత పోటీల్లో బహుమతులను సాధిస్తున్నట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు లహరిని అభినందించారు.

అంగన్వాడీ కేంద్రాలకు చేయూత

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్ మద్దతుతో సోమవారం డిజిటల్ వెయింగ్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐసిడిఎస్ సిడిపిఒ సౌభాగ్యమ్మ, సూపర్వైజర్లు, టాటా ట్రస్ట్ ప్రోగ్రామ్స్ ప్రతినిధి రామకృష్ణ, అంగన్వాడీ వర్కర్లకు పిచ్చాటూరు శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో స్వయంగా డిజిటల్ వెయింగ్ మిషన్లను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు నవీన, కావ్య, బేబీ, రాజేశ్వరి, శ్రీదేవి, భగవతి సుమతి తదితరులు పాల్గొన్నారు.

సిటీఆర్ నెత్రంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని సిటీఆర్ నెత్రం గ్రామంలో పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ సిటీఆర్ నత్రంలో కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ 24వ తేదీ నుండి 30వరకు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛభారత్ గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగిస్తారని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆరోగ్య అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, బాబురావు, డాక్టర్ తిరుమలయ్య, డాక్టర్ గంగయ్య తదితర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నెత్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కేవీబీపురం: కెవిబిపురం మండలం, ఎగువపూడి నివాస ప్రాంతాలకు దగ్గరగా అక్రమంగా క్వారీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గ్రామాల సమీపంలో క్వారీలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యాజమాన్యం గ్రామస్తుల అభిప్రాయాలకు భిన్నంగా క్వారీ నడపాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. తక్షణమే అక్రమంగా మంజూరు చేసిన క్వారీ అనుమతులను అధికారులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెంగమ్మ, బాలకృష్ణ, రాజా, రాములు, మనోహర్, గ్రామస్తులు తహశీల్దార్ రోశయ్యకు వినతి పత్రం అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - బాలాయపల్లి : అనేక సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ చర్యలు చేపడుతుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బాలాయపల్లిలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఆయా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 72 విజ్ఞప్తులు రాగా 32 రెవెన్యూ, 19అన్నదాత సుఖీభవ, 21 పెన్షన్లు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏయంసి ఛైర్మన్ పునుగోటి విశ్వనాథం, తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్లేస్మెంట్ డ్రైవ్ అత్యంత విజయవంతంగా పూర్తయింది. ప్రముఖ సంస్థల క్యాంపస్ సందర్భంగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఈ ఫ్లేస్మెంట్ డ్రైవ్లో ప్రధానంగా ఫ్లీడర్ ఎలక్ట్రిక్, అశోక్ లేలాండ్, ఎబిటీ, టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఈ కార్యక్రమంలో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరు, నెల్లూరు నుంచి మొత్తం 395 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఎంపిక కావడం కళాశాలకు ఎంతో గర్వకారణమని కళాశాల మేనేజ్ మెంట్ డైరెక్టర్ విజయ్, డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మలు తెలిపారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్ పట్ల రిక్రూట్మెంట్ టీమ్స్ సంతృప్తిని వ్యక్తం చేశాయని తెలిపారు. నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విశ్వనాథ్ రెడ్డి సెలెక్ట్ అయిన విద్యార్థులను అభినందించారు.

8వ పే కమిషన్లో సవరణలు చెయ్యాలి

■ 26న సిటీయూ నిరసనలకు సంఘీభావం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎనిమిదవ పే కమిషన్ టిఓఆర్లో సవరణలో చేసి ఎన్పిఎస్, యుపిఎస్ రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ను అమలు చేయాలని, సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 2022 నుండి ఆందోళన చేసున్నా చర్యలు తీసుకోకపోవడం దారుణమని, సమస్యల పరిష్కారం కోసం కాన్ఫిడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ చేపట్టిన దశల వారి నిరసన కార్యక్రమాలకు సంఘీభావంగా వివిధ రూపాలలో డిమాండ్ల సాధనకై పోరాడుతామని కాన్ఫిడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్లు ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎనిమిదవ పే కమిషన్ టిఓఆర్లో పెన్షనర్లు, ఫ్యామిలీ ఫంక్షన్ హాల్లో ఫంక్షన్ రివిజన్ను పూర్తిగా విస్మరించారని, అన్ఫండెడ్ నాన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్స్ అనే పదం చేర్చడంపై తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. సంఘాల గుర్తింపు రద్దు, అన్యాయమైన శిక్షలు, యూనియన్ కార్యకర్తలపై పరిధికార చర్యలు, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేయకపోవడం, ఉద్యోగుల సమాఖ్య తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వీటన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ దేశ వ్యాప్త ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. డిసెంబర్ 15 దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం, 16న లంచ్ అవర్ నిరసనలు, డిసెంబర్ 31న రాష్ట్ర సదస్సులు (తెలిపిన తేదీలలోపుగా) 50 శాతం డిఎ, డి ఆర్ బేసిక్ లో విలీనం, 20 శాతం ఐఆర్, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను పునరుద్ధరించాలన్నారు. కోవిడ్ కాలంలో 18 నెలల డిఎ, డిఆర్, విడుదల చేయాలని, కాళీ పోస్టర్లు భర్తీ చేస్తూ అవుట్సోర్సింగ్ నిలిపివేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నాలుగు కార్మిక కోడ్లు ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని సమాఖ్య స్పష్టం చేస్తోందన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: డిసెంబరు 21,22 తేదీల్లో జరుగనున్న రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ధనుంజయులు సోమవారం విడుదల చేసి ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభలు శ్రీకాళహస్తి, సుందరయ్య భవనంలో నిర్వహించనున్నామని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి 200 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని, జిల్లా నాయకత్వం ఈ మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి కార్యాచరణ రూపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రైతుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ, సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేయనున్నమని తెలిపారు. యూరియా కోసం, గిట్టుబాటు ధరకోసం, పాసు బుక్కుల పేరుతో రైతులను వేధించడం వంటి సమస్యలపై పోరాడనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చేవరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం నెలవాయి రైతులు కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సుదర్శన్ నాయుడు, శేఖర్, ముని కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం, గంజాయిని అరికట్టాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో మద్యాన్ని, గంజాయిని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.నదియా డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు తిరపతి నగర ముఖ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నదియా మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వం విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో, మద్యం దుకాణాల ముందే మద్యం, గంజాయి తాగి మహిళలపై దాడులు చేస్తున్నారని, రోజురోజుకు తిరుపతి నగరంలో రౌడీ మూకల దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, మహిళలు రోడ్లపై రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని వాపోయారు. సీఎం, హోం మినిస్టర్లు దృష్టి సారించి డీఎస్పీ స్థాయిలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి తిరపతి నగరాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రసూతి హస్పటల్లో ఒక్కొక్క బెడ్పై ఇద్దరు, ముగ్గురు మహిళలను పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారని, దీనివలన గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రసూతి హాస్పిటల్లో మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించి, మెరుగైన వైద్యం అందించకపోతే పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు రత్నమ్మ, మంజుల, విజయ తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: కేవిబి పురం మండలం, పెద్ద రాయల చెరువు వరద బాధిత గ్రామాల్లో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం ఎమ్మెల్యే తిరుపతి కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని సత్యవేడు నియోజకవర్గ సమస్యలను కలెక్టర్కు విన్నవించారు. మత్స్య కార్మికులకు వరద సాయం క్రింద బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని, నారాయణవనంలో 20 మంది చేనేత కార్మికులకు బియ్యం పంపిణీ చేయాలని, రేషనలైజేషన్ పేరిట రద్దు చేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని కోరారు. పిచ్చాటూరు జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని కోరగా, రూ.35 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారికి సూచించారు. అనంతరం తిరుపతి ఆర్టీసి రీజినల్ మేనజర్ను ఎమ్మెల్యే కలిసి సత్యవేడు-మదనపల్లి బస్సును పునరుద్ధరించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - నాయుడుపేట: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకుని భారతదేశంలో గర్వించదగ్గ భావిభారత పౌరులుగా ఎదగాలని ఏజీఎమ్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం నాయుడుపేట, అగ్రహార పేటలోని శ్రీ చైతన్య స్కూల్లో ఏర్పాటుచేసిన నాసా కాన్సెప్ట్కు ఎంపికైన శ్రీ చైతన్య విద్యార్థుల అభినందన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీ ఆర్ ఎస్ డబ్ల్యు జూనియర్ కాలేజీ లెక్చరర్ మోహన్ మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ తమ విద్యార్థులను అన్ని విధాల తీర్చిదిద్దుతూ పరిజ్ఞాన విజ్ఞానంలో వారిని శరవేగంగా అభ్యసించేలా ఉత్సాహ పరుస్తున్నారని తెలిపారు. ఈ స్కూల్ నుంచి నాసా కాన్సెప్ట్ 47 మంది విద్యార్థులు ఎంపికవడం హర్షణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు నాసా టీ షర్ట్స్, కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాసులు, ఇంచార్జ్ మురళీకృష్ణ, నాసా ఇన్చార్జ్ గౌతమ్, ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాకవి అందెశ్రీకి నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రముఖ ప్రజా కవి అందెశ్రీకి ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అందెశ్రీ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య మాట్లాడుతూ అందెశ్రీ సాహితీ లోకానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, పులి రాధాకష్ణయ్య, గురునాథం, మునిసుబ్బారెడ్డి, షణ్ముగం పాల్గొన్నారు.

టయోటా షోరూం వద్ద ప్రమాదాలపై ఎంపికి వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి: రేణిగుంట మండలం. తూకివాకం సమీపంలోని టయోటా షోరూం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారి నిర్మించిన తరువాత వాహనాల వేగం పెరిగిందని గ్రామస్తులు ఎంపి మద్దిల గురుమూర్తితో మొరపెటుకున్నారు. తిరుపతి ఎంపిని ఆయన కార్యాలయంలో తూకివాకం, పన్నీరుకాల్వ, కొత్తకాల్వ, కొత్ర మంగళం, విఆర్ కండ్రిగ గ్రామాల ప్రజలు కలిసి తమ బాధను వివరించారు. వెహికల్ అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎంపి స్పందిస్తూ బ్రిడ్జి ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై పూర్తిస్థాయి సాంకేతిక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను మంత్రి గడ్కరీ ఆదేశించినట్లు ఎంపి తెలిపారు. ఈ సమావేశంలో రేణిగుంట మాజీ జడ్పీటిసి తిరుమల రెడ్డి, తూకివాకం ఎంపిటిసి ఆనందరావు, వార్డు మెంబర్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'రైతన్నా మీకోసం'ను కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - రేణిగుంట: రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం పరిశీలించారు. అన్నదాత సుఖీభవ లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాల అమలు తీరు, రైతు యాప్ ఉపయోగాలు, సబ్సిడీపై అందిస్తున్న స్ప్రింక్లర్ పరికరాలు, ఉద్యానపంటల ప్రాముఖ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతన్న మీకోసం సర్వేలో వ్యవసాయ పశుసంవర్ధక శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, గ్రామ రెవెన్యూ అధికారి, విలేజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, విలేజ్ ఎనర్జీ అసిస్టెంట్ తప్పనిసరిగా పాల్గొని 29వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

మునీర్ అహ్మద్కు ఎంఎల్ఏ అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి : వరల్డ్ కేటిల్ బెల్ ఛాంపియన్ షిప్ అథ్లెటిక్స్ లో సిల్వర్ సాధించిన మునీర్ అహ్మద్ షేక్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివా సులు అభినందించారు. సోమవారం మధ్యాహ్నం అహ్మద్ షేక్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను కలిసి తాను ఇటీవల చైనాలో జరిగిన వరల్డ్ కేటిల్ బెల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో దేశం తరపున సిల్వర్ మెడల్ సాధించినట్లు వివరించారు. తాను స్టేట్ ఛాంపియన్ షిప్ ను 10 సార్లు, 8 సార్లు కేటిల్ బెల్ నేషనల్ ఛాంపియన్గా నిలిచినట్లు ఎమ్మెల్యేకి తెలిపారు.

డ్రగ్స్ మత్తుకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కళాశాల విద్యార్థులు ఎంతో ఉజ్వల భవిష్యత్తును సాధించడానికి డ్రగ్స్ మహమ్మారి మత్తుకు యువత బానిస కాకూడదని, జీవిత లక్ష్యాలకు, తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు గమనంలో ఉంచుకోవాలని గోవిందధామం అధ్యక్షులు టెంకాయల దామోదరం, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రెడ్డప్ప విద్యా ర్థులకు సూచించారు. సోమవారం తిరుపతి కరకం బాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు డ్రగ్స్ మత్తుపై కళాశాల జాతీయ సేవ విభాగం, రాష్ట్ర స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించా రు. యువత చెడు వ్యసనాలకు బానిసలు అయ్యి వారిని నమ్ముకున్న తల్లిదండ్రులను శోకసంద్రంలో నెట్టే పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయన్నారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించిన విధంగా భారతదేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, తప్పుడు మార్గంలో జీవితాన్ని ప్రయాణింపజేసి తల్లిదండ్రులు ఆశయాలను కాలరాయొద్దని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయచంద్ర మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మేనేజ్మెంట్ డ్రగ్స్, ర్యాగింగ్ రహిత కళాశాలగా చేసామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, జాతీయ సేవ విభాగం కన్వీనర్ యెస్.చక్రిశ్రీధర్ పాల్గొన్నారు.

హాకీ ఛాంపియన్గా కడప జిల్లాజట్టు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 69 వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 14 సంవత్సరంలోపు బాల బాలికల స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో బాలురు, బాలికల విజేతగా కడప జిల్లా జట్టు నిలిచింది. బాలుర ఫైనల్స్లో వైయస్సార్ కడప జిల్లా జట్టు విశాఖ జట్టుపై ఐదు ఒకటి గోల్స్తో గెలిచి విన్నర్గా నిలిచి చాంపియన్షిప్ ట్రోఫీని అందుకున్నారు. విశాఖ జిల్లా జట్టు రన్నర్అప్గా ద్వితీయ స్థానంతో ట్రోఫీ అందుకున్నారు. బాలికల ఫైనల్ మ్యాచ్లో వైయస్సార్ కడప జిల్లా జట్టు అనంతపురం జిల్లా జట్టుపై 4/1 గోల్స్తో గెలిచి చాంపియన్షిప్ ట్రోఫీ అందుకున్నారు. అనంతపురం జిల్లా జట్టు ద్వితీయ స్థానంతో రన్నరప్గా నిలిచింది. అంతకు ముందు జరిగిన బాలురు మొదటి సెమీఫైనల్స్ లో విశాఖ జట్టు నాలుగు సున్నా గోల్స్ తో తూర్పుగోదావరి జట్టుపై విజయం సాధించి ఫైనల్స్ చేరుకుంది. అలాగే మరొక సెమీఫైనల్స్ లో బాలురు విభాగంలో వైయస్సార్ కడప జిల్లా జట్టు 5 0 గోల్స్ తో అనంతపురం జట్టుపై గెలిచి ఫైనల్స్కు చేరింది. బాలికల సెమీఫైనల్స్లో మొదటి సెమి ఫైనల్ వైఎస్సార్ కడప జిల్లా జట్టు 7 0 గోల్స్తో విశాఖపట్నంపై గెలిచి ఫైనల్కు ప్రవేశించింది. బాలికల రెండవ సెమీఫైనల్లో అనంతపురం జట్టు నాలుగు సున్నా గోల్స్ తో ఈస్ట్ గోదావరిని ఓడించి ఫైనల్స్ కు అర్హత సాధించింది. తదుపరి నిర్వహించిన తృతీయ ఇస్తాను పోటీల్లో బాలికల విభాగంలో విశాఖ జట్టు రెండు ఒకటి గోల్స్ తో ఈస్ట్ గోదావరి జట్టును ఓడించి తృప్తి స్థానాన్ని నిలబెట్టుకుంది ఈస్ట్ గోదావరి జట్టు నాలుగో స్థానంతో తృప్తి చెందాల్సి వచ్చింది బాలుర తృతీయ స్థానానికి జరిగిన పోటీల్లో ఈస్ట్ గోదావరి జిల్లా జట్టు అనంతపురం జట్టుపై మూడు సున్నా గోల్స్ తేడాతో గెలిచి మూడో స్థానాన్ని పొందగా నాలుగో స్థానంలో ఈస్ట్ గోదావరి జిల్లా జట్టు నిలిచింది.

చెరువు కట్ట ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని సంతదాసు పల్లి చెరువు కట్ట ధ్వంసంపై గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఇరిగేషన్ ఏఈ సురేష్ బాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతదాసు పల్లి గ్రామ చెరువు కట్టను సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హిటాచీతో ధ్వంసం చేశారన్నారు. నీటి సంఘం అధ్యక్షులు ఇనుకుర్తి వెంకటేశ్వర్లు నాయుడు తనకి సమాచారం అందించడంతో వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు.

పట్టాలిచ్చి.. వసతులు కల్పించండి

సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్కు వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధిలోని జ్యోతిబసు నగర్ నివాసితులు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జ్యోతిబసునగర్ నివాసితులకు ఇంటి పట్టాలు ఇచ్చి హౌసింగ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో కొంతమంది ఎస్టీలు గుడిసెలు వేసుకొని కాపురం ఉంటున్నారని, పాములు బెడద ఎక్కువగా ఉంటోదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. తాగు నీటి బోరు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీ కాలనీలో 50 సంవత్సరాలుగా అనుభవంలో ఉన్న డీకేటి భూములను భూములను పుత్తూరుకు చెందిన వేలు మొదలియార్ అనే వ్యక్తి 2014లో ఆక్రమించుకోవడం దారుణమని ఆరోపించారు. ఇప్పటికైనా పుత్తూరు తహశీల్దార్ స్పందించి ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పగించి ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పుత్తూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, గ్రామస్తులు రాఘవమ్మ, నాగభూషణం, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - నాయుడుపేట: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తూ ప్రోత్సహించడం ఆనందదాయకమని నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.కే.రఫీ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా, నాయుడుపేట పట్టణంలోని సి.ఎస్.తేజ థియేటర్ ముందు స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహన్ని ఏర్పాటు చేస్తుండడం తెలిసినదే. ఈ విగ్రహ ఏర్పాటును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రోత్సహిస్తుండడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా పట్టణ టిడిపి సీనియర్ నాయకులు కోట్లపాటి గాంధీ నాయుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దాదాపుగా రెండు లక్షల 20వేల రూపాయలు ఖర్చయ్యే స్టీలు వర్క్ కోసం మునిసిపాలిటీ వైస్ చైర్మన్ ఎస్.కే.రఫీ చేతులమీదుగా విశాల్ స్టీల్ రైలింగ్ వారికి సోమవారం లక్ష రూపాయలు అడ్వాన్సుగా అందించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి నాయకులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ అత్తి కాయల సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు గుంటూరు లక్ష్మయ్య, మునిగోపి, వెంకటసుబ్బయ్య నాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల కేంద్రం నారాయణవనంలో సోమవారం 11మంది లబ్దిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందచేశారు. మొత్తం 9,54,611 రూపాయల చెక్కులను ఆయన బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, వాసు రెడ్డి, మురళీ, నారాయణవనం, సత్యవేడు, పిచ్చాటూరు, కేవీబి పురం, వరదయ్యపాలెం మండలాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో జీవపరిణామంపై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేణిగుంట బాలికల, బాలుర పాఠశాలల్లో జీవపరిణామంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవపరిణామ దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామని జెవవి జిల్లా ఉపాధ్యక్షులు ఒ.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుప్పస్వామి, సైన్స్ టీచర్లు శిరీష, విజయ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భారత స్వాతంత్రోద్యమ తొలి పోరాట వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని సోమవారం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. తొలితరం స్వాతంత్ర సమరయోధుడిగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశ ప్రజల్లో తిరుగుబాటు కాంక్షను రేకెత్తించారని రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచు రెడ్డి అన్నారు. బ్రిటీషర్లకు ఎదురొడ్డి నిలిచి చివరకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు ఉయ్యాలవాడని కొనియాడారు. ఉయ్యాలవాడ స్ఫూర్తితో నేటితరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి సునీల్ కుమార్, కోశాధికారి మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తిరుమల మొదటి ఘాట్లో కారు బోల్తా

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన శ్రీవారి భక్తులకు స్వల్పంగా గాయాలయ్యాయి. బ్రేక్ ఫెయిల్ కావడమే ఈ ప్రమాదానికి దారితీసినట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే టీటీడీ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. కారు రోడ్డుకు అడ్డుగా పడటంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందిన వెంటనే టీటీడీ సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. కారును తొలగించారు.ట్రాఫిక్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి

ప్రజాశక్తి - చంద్రగిరి : రంగంపేట ఫారెస్ట్ బంగ్లా సమీపంలో పీలేరు నుండి తిరుపతికి వేగంగా వెళుతున్న కారు, రోడ్డు దాటుతున్న దుప్పిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. కార్ ముందు భాగం దెబ్బతినింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతుల పక్షపాతి సీఎం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ ఎంపీపీ బిందు మాధవి పేర్కొన్నారు. సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు విడుదలపై మండలంలోని అన్ని గ్రామాలలో స్థానిక టిడిపి నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన రైతులకు ఎవరికైనా అన్నదాత సుఖీభవ నగదు జమ కాకుండా ఉంటే వ్యవసాయ శాఖ హెల్ప్ డస్క్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సింగిల్ విండో చైర్మన్ జనార్దన్ చౌదరి ఇంటింటి ప్రచారంలో అన్నదాత సుఖీభవ వర్తించని రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ చేకూరి జనార్దన్ చౌదరి, వెంకట ప్రసాద్, కోరా హరి ప్రసాద్, లెక్కల మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి నుంచి శ్రీనివాసమంగాపురం మార్గంలో నూతన జాతీయ రహదారి ఫ్లైవోవర్ వద్ద రోడ్డుపై లోయను తలపించేలా గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు గుర్తించ లేక ప్రమాదాలకు గురవుతున్నారు. శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమల శ్రీవారి దర్శనానికి, పీలేరు, మదనపల్లెకు, తిరుపతిలోని పలు విద్యాసంస్థలకు ఈ మార్గంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఒక ద్విచక్ర వాహనదారుడు ఈ గుంతను గమనించలేక అదుపు తప్పి గాయాల పాలయ్యాడు. ఈ సమస్యపై ప్రజాశక్తిలో వార్త ప్రచురితమవగా, స్పందించిన చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేసి వాహన దారులకు అవగాహన కల్పించారు.

శ్రీచందన మావులేటికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని ఎమ్ శ్రీచందనకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె అసిస్టెంట్ ప్రొఫెసర్ డి సుజాత, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మార్గదర్శకత్వంతో 'అసెస్ మెంట్ ఆఫ్ ఆటోఇమ్యూన్ రిస్క్ అసోసియేటెడ్ విత్ పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ థెరపీ' అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని ఎమ్ శ్రీచందనకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు వెల్లడించారు. ఎమ్ శ్రీచందన కి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

లోపల సరే.. బయటే భయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లోపలికి వెళ్లాలంటే రోగులు, వైద్య సిబ్బంది భయపడిపోతున్నారు. ఆసుపత్రి గేటు వద్ద ఇనుప రాడ్లతో నిర్మించిన చిన్నపాటి కల్వర్టు వాహనాల రాకపోకలతో కిందకు వంగింది. ఇనుపరాడ్ల మధ్య ఖాళీలు కూడా ఎక్కువగా ఉండడంతో గేటు దాటేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు, వారి బంధువులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో వద్ధులు కూడా ఎక్కువగానే ఉంటారు. వద్ధులు గేటు దాటే సమయంలో కల్వర్టు వద్ద ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తుంది. ఆసుపత్రి ఆవరణలోకి వెళ్లే ఆవులకు ఇనుపరాడ్ల మధ్య కాళ్లు ఇరుక్కుని గాయాల పాలవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతు చేయాలి : గరికపాటి రమేష్ బాబు, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు

ఆసుపత్రి లోపల టైల్స్ వేసి అభివద్ధి చేశామని అధికారులు చెప్పుకుంటున్నారు. గేటు వద్ద పొంచి ఉన్న ప్రమాదాన్ని ఎందుకు గుర్తించలేదు. ఇనుప కల్వర్టుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
A.S.NO. 67 OF 2024
S. Chandra Babu ...Appellant
Vs
N. Prabhavathi ...Respondent
To
N. Prabhavathi wife of N. Muni Sekharachari, Flat No. 501, Ushasree apartments, SV Nagar, Tirupati urban mandal and district
Whereas the appellant has instituted a appeal against you, your are hereby summoned to appear in the court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the appeal or who shall be accompanied by some other person able to answer all such questions on that date 01-12-2025 at 10-30 am in the fore noon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. Take summons that in default of your appearance on the day above mentioned, the appeal will be hard and determined in your absence
Date of Hearing:- 01-12-2025
G TIRUMALA REDDDI,
ADVOCATE, TIRUPATI.
Cell No. 9963918447

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. No: 189 / 2025
1. Shaik Shaliha
2. Shaik Farhan Ahmed
3. Shaik Aamira Faziya ...పిటిషనర్లు
Vs.
Nil ....రెస్పాండెంట్
జనరల్ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబర్ కేసులో పిటిషనర్లు సూళ్ళూరుపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్లో వున్న Shaik Muntaz begam గారి bank safe Locker deposit మొత్తమును మాకు రావలసినదిగా కోరుచూ పై కోర్టులో Succession Certificate కొరకు పిటిషను పెట్టి వున్నందున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 28-11-2025 పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది.
ఇట్లు
ఎస్. చంద్రమోహన్ రెడ్డి, బి.కాం, బి.ఎల్.,
అడ్వకేట్, గూడూరు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 97 / 2024
ముత్తుకూరు పెంచలయ్య ...వాది
Vs.
ముత్తుకూరు మహాలక్ష్మమ్మ and 4 Others ...ప్రతివాదులు
నోటీసు
To, D3. నిమ్మటి సులోచన, W/o భాస్కర్, మాచవరం గ్రామం, ఓజిలి మండలం, తిరుపతి జిల్లా.
పై దావాలోని వాది పై కోర్టులో మీ పైన తనకు రావలసిన భాగం కొరకు భాగ దామాషా కేసు వేసియున్నాడు. సదరు దావా మీ నోటీసు నిమిత్తం తే.25-11-2025దిన వాయిదా పడియున్నది. కావున ఆ దినం మీరు గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 గం॥లకి హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును. అని తెలియజేయడమైనది.
ఇట్లు
పి.వి. సాయికుమార్ రెడ్డి,
వాది తరపు న్యాయవాది, గూడూరు.

In The Court of the Prl. Senior Civil Judge, Chittoor
O.S. NO. 53/2024
Rudra Gopi ...Plaintiff
Vs.
P.Nagarthnamma ...Defendant
NOTICE TO THE DEFENDANT
P.Nagarathnamma W/o P.Subramanayam D.No. 18-2-243/C, Abbanna Colony, Ashok Nagar, Tirupati Town & Dist., Andhra Pradesh
Please take notice that the plaintiff filed the above case for Specific performance of agreement of Sale. You are have by summoned to appear before the above said Court on 02.12.2025 at 10.30 am in person or by pleader duly instructed and above answer the said case. failing which the matter will be decided aganist you as per law.
Date of Hearing: 02.12.2025
IRUGU SURENDRA SARAVANA
ADVOCATES, TIRUPATI. Cell: 9966688800

పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 11 వేల పోస్టులు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు నాగరాజు, విక్రమ్ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడు మండలం, బాలిరెడ్డిపాళెం శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మల ఆర్థిక సౌజన్యంతో నెల్లూరు జిల్లాకు చెందిన కమ్మవారిపాలెం, అల్లూరు గ్రామాలకు చెందిన వరలక్ష్మి, శ్రీనివాసాచార్యులు, భార్గవ శేష సాయి కుటుంబాలకు సోమవారం సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ దాతల దాతృత్వంతో ఆర్థిక సహాయాన్ని, ఫలసరుకులు, కూరగాయలను అందించామని తెలిపారు. ముమ్ముందు దాతల దాతృత్వంతో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి సంస్థ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నామన్నారు. దాతలకు ధన్యవాదములు తెలియజేశారు.

పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్యపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంగన్వాడి హెల్పర్స్ ఐసిడిపిఎస్ పుత్తూరు ప్రాజెక్ట్ ఆఫ్ వడమాలపేట మండలం, పుత్తూరు మండలం, సిడిపిఓ కార్యాలయంలో, పుత్తూరులో టార్గెటెడ్ ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై సామర్థ్య నిర్మాణ శిక్షణ సోమవారం నిర్వహించారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్ట్స్, ప్రోగ్రామ్ అసోసియేట్ సంతోషి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిక్షణ సమయంలో అంగన్వాడి హెల్పర్స్ ఉత్సాహంగా పాల్గొనేందుకు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. పోషణ, ఆరోగ్యం, విద్యల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగం, క్లినికల్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో పీఎంఉష సాఫ్ట్ కాంపోనెంట్ 34 సహకారంతో "బిల్డింగ్ ఎఫెక్టివ్ హెల్పింగ్ స్కిల్స్–అవగాహన కార్యక్రమం భవిష్యత్ ప్రాక్టీషనర్ల కోసం" అనే అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.ఆర్.కె టెక్నాలజీస్ రిసోర్స్ పర్సన్‌గా ట్రైనర్ రమ్య సోషల్ వర్క్, క్లినికల్ సైకాలజీ విభాగాలకు చెందిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ప్రక్రియలో అవసరమైన ప్రాథమిక, అభివృద్ధి నైపుణ్యాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఎంపథీ, ఆక్టివ్ లిసనింగ్, అబ్జర్వేషన్ స్కిల్స్, ఇతర ప్రొఫెషనల్ డెవలప్మెంట్‌కు అవసరమైన నైపుణ్యాలను వివిధ యాక్టివిటీస్, గ్రూప్ ఎక్సర్సైజులు, రోల్ ప్లేస్ ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మకంగా నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. అనురాధ, ప్రొఫెసర్ ఎన్. రజిని, ప్రొఫెసర్ లలితకుమారి, డాక్టర్ మల్లీశ్వమ్మ, డాక్టర్ వజీహాభాను, ప్రాజెక్ట్ అసిస్టెంట్లు, డాక్టర్ గాయత్రి, డాక్టర్ లత, మిస్ ఫైజా స్కాలర్లు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలలో ఏపీ పీజీ సెట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో పీజీ స్పాట్ అడ్మిషన్లను వెంటనే నిర్వహించాలని సోమవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులతో నిరసన తెలుపుతూ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నేతలు పాల్గొన్నారు.

'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రైతు సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ గంజి మాధవయ్య సూచనలతో పుత్తూరు రూరల్ మండలం వేపగుంటలో సోమవారం 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం ప్రారంభించారు. ప్రతీ రైతు ఇంటికి వెళ్లి సీఎం సందేశ పత్రాన్ని రైతులకు అందజేశారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, రైతాంగం సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు అరవ బాలాజీ, వ్యవసాయ శాఖ ఏడీఏ కె.లక్ష్మీదేవి, ఏవో ఎస్.కోదండయ్య, వీఏ ఈ.మురళి, వీఏఎస్ డా.ఎస్.శ్రీదేవి, ఏహెచ్ఏ పి.రామచంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ డి.అబ్దుల్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగమండలం, కాటూరు పంచాయతీలో సోమవారం రైతు సేవా కేంద్రంలో బుచ్చినాయుడు కండ్రిగ ఏయంసి ఛైర్మన్ ఎం.జ్యోతి సుధాకర నాయుడు అధ్యక్షతన మండల వ్యవసాయ అధికారి, మండల తహశీల్దార్ శ్రీదేవి, మండల అభివృద్ధి అధికారి వెంకటరత్నమ్మ, సింగల్ విండో అధ్యక్షులు భాస్కర్ యాదవ్‌ల ఆధ్వర్యంలో 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి షణ్ముగం, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ మండల పరిధిలోని పోటుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి రైతు ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు కోట మండలం, కొక్కుపాడు గ్రామంలో సోమవారం 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు పలగాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ మద్రి ప్రమీల, తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, తిరుపతి జిల్లా రైతు విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి నెల్లూరు మోహన్ రెడ్డి, కోట బిట్ వన్ ఎంపీటీసీ దారా సురేష్, కొత్తపాలెం ఎంపీటీసీ యానాటి నారాయణ, వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, వాకా విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు సంబంధించి 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రైతులకు సంబంధించి సర్వే చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి దీపాలి తెలిపారు. ఈ సర్వేలో భాగంగా గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వో, ఇంజనీరింగ్ సహాయకులు, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ సహాయకులు సంయుక్తంగా ఏర్పడి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేలో భాగంగా రైతులకు నీటి భద్రత డిమాండ్ ఆధారంగా పంటల సాగు, అగ్రిటెక్, ధాన్యం కొనుగోలు వంటి అంశాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు సంబంధించి సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేకు రైతులందరూ సహకరించాలని మండలవ్యవసాయ అధికారిణి తెలిపారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రైతులను అన్ని విధాలుగా ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పష్ట చేశారు. సోమవారం మండల పరిధిలోని వేటగిరిపాలెంలో 'రైతన్నల సేవలో మన మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు కావలిసిన, ఎరువులు, స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ శ్యాలకుమారి, ఎంపిడి ఓ గోవర్ధన్, ఏఓ జ్యోతి, ఏపిఎమ్ మునిరజా, టీడీపీ నాయకులు పిఏసిఎస్ చేర్మెన్ ఎమ్.శ్రీహరిరెడ్డి, ఎస్ విజయకుమార్, వి నాగేంద్రనాయుడు, మనోహర్ రెడ్డి, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించండి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో సమాజాన్ని చైతన్యపరిచేలా చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాగే అంతరించిపోతున్న తెలుగు భాష పరిరక్షణకు కార్యక్రమాలు చేపట్టాలని ఎ.పి తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్ శరత్ చంద్ర కోరారు. పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గ సభ్యులు సోమవారం తిరుపతి శ్రీ పద్మావతి వర్సిటీలోని సావేరి విశ్రాంతి గహంలో అకాడమీ ఛైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా మెమెంటో, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ జిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పిఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలను తెలియజేశారు. తెలుగు భాష పరిరక్షణకు అకాడమీ తరపున కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని చెప్పారు. అకాడమీ ఆధ్వర్యంలో బాలసాహిత్యాన్ని ప్రోత్సహించాలని, తద్వారా భావిపౌరులైన బాలబాలికలు తెలుగు భాషపై మక్కువ పెంచుకుంటారని తెలిపారు. ఇందుకు అకాడమీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ వైస్ ఛైర్మన్ ఆచార్య ఎన్.శ్రీరజని, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, కార్యవర్గ సభ్యుడు ఆర్సీ కష్ణస్వామిరాజు, పూర్వ ఛైర్మన్ ఆచార్య త్రిపుర సుందరి, సభ్యులు రవీంద్ర పాల్గొన్నారు.

పరశురామేశ్వరుని సేవలో పలువురు

ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబర్ వెంకట్రామనాయుడు, బెంగళూరుకు చెందిన రామలింగప్ప గుడిమల్లం శ్రీ పరుశురామేశ్వరుని సోమవారం దర్శించుకు న్నారు.ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 ,10వ తరగతి విద్యార్థులు సుమారు 50 మంది ప్రధానోపాధ్యాయులు చెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మైండ్స్ ఛాలెంజ్ పిచ్ హ్యాకథాన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం సంస్థల ఆవిష్కరణ మండలి ఆధ్వర్యంలో వుమెన్ బయోటెక్ ఇన్క్యుబేషన్ ఫెసిలిటీలో "బ్రైట్ మైండ్స్ సొసైటల్ ఛాలెంజ్ పిచ్ హ్యాకథాన్" నిర్వహించారు. విద్యార్థులలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, సృజనాత్మకతను పెంపొందించడం, సమాజ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కనుగొనే దిశగా మార్గనిర్దేశం చేయడమే ఈ హాకథాన్ ముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమంలో సైన్స్, టెక్నాలజీ, ఆర్ట్స్, కంప్యూటర్ సైన్స్, వంటి వివిధ విభాగాలకు చెందిన పీహెచ్డీ, ఫార్మసీ, ఎంబిఎ,ఇంజనీరింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆచార్య విద్యావతి , ఆచార్య రజిత, సూర్యకుమార్, బిందు, అమల పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.

అన్నమయ్య డాన్స్ అకాడమీకి డివైన్ బుక్ ఆఫ్ రికార్డ్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో అన్నమయ్య డాన్స్ అకాడమీ, సంస్కృత వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీత డివైన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని భగవద్గీత శ్లోకాలను సామూహికంగా ఆలాపించారు. ముఖ్య అతిథి డాక్టర్ యన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచే భక్తి మార్గంలో నడవాలని సూచించారు. అన్నమయ్య డాన్స్ అకాడమీ అధినేత శ్రీరామ్‌కి డివైన్ బుక్ ఆఫ్ రికార్డ్ – ముంబై ప్రతినిధులు దర్శన్ ద్వారా ప్రత్యేక అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఐటిఐ కాలేజీ కరస్పాండెంట్ ప్రకాష్ రెడ్డి, విస్‌డమ్ హైస్కూల్ కరెస్పాండంట్ రఘు, శ్రీనివాసరావు, మధు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్ల మోహన్ ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గ దివ్యాంగుల విభాగ నాయకులతో కలిసి సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, ఏవో శిరీషకు తమ పరిధిలో ఉన్న పలు రకాల దివ్యాంగుల సమస్యలు పరిష్కారించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విభాగ నాయకులు మాట్లాడుతూ.. డీఎల్సీ జిల్లాస్థాయి దివ్యాంగ నాయకులు జిల్లా అధికారులతో, జిల్లాలోని దివ్యాం గుల సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశం నిర్వహించా లని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగులను భర్తీ చేయాలని, ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాన్ని, దివ్యాంగుల కుటుంబాలకు ఉచిత ఏపీఎస్పీడీసీఎల్ కరెంట్ సదుపాయాన్ని కల్పించాలని, వివిధ అంశాలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్ర మంలో వైఎస్ఆర్సిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర నాయకులు ఆవుల నాగేంద్ర, నగర అధ్యక్షులు సుభాన్ భాష, తడ ప్రభుదాస్, బండి పోలయ్య, తులసి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : నాని

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి దేవస్థాన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు. అమ్మవారి గర్భగుడి ద్వార మందిరం సుమారు పది లక్షల రూపాయలతో పంచలోహ తాపడం దాతలు వితరణ చేశారన్నారు. సోమవారం సాయంత్రం దాతల సహకారంతో నిర్మించిన పంచలోహ తాపడాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, భక్తులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొన్నారు.